అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 27 ఫిబ్రవరి 2023

మెడికో విద్యార్థి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-జన్నారం

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మెడికో విద్యార్థి దాసరి హర్ష కుటుంబాన్ని ఆదివారం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా టీజీఓ అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్ పరామర్శించారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్త బట్టి రాజలింగు కుమారుడు శివకుమార్ అడవి పంది తాకి, కాలికి తీవ్ర గాయాల కాగా అతనిని జన్నారంలో పరామర్శించి తగు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో కోఆప్షన సభ్యులు మున్వర్ అలీ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్ బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిటీమల భరత్ కుమార్, సర్పంచ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నర్సాగౌడ్, బట్టి రాజలింగు పాల్గొన్నారు.

వీఆర్ఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ)కు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆదివారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు వినతిపత్రం ఇచ్చింది. వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేస్తామని సీఎం కేసీఆర్ నిండు అసెంబ్లీలో హామీ ఇచ్చారని, నేటి వరకు అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అర్హత కలిగిన వీఆర్ఏలకు పదోన్నతులు, 50 ఏళ్ల దాటిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పిస్తూ జీఓలు జారీ చేసేలా ఒత్తిడి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ కామెర నారాయణ, కో చైర్మన్ సెండె విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కో కన్వీనర్లు దేవాజీ, చందు, గౌరవాధ్యక్షులు అజ్గర్‌అలీ, వీఆర్ఏలు సునీతాదేవి, శంకర్, గుడాన్‌లు పాల్గొన్నారు.

బయటకు వచ్చిన ఈఎస్ఐ సామాగ్రి

- ఆటోలో తరలించే ప్రయత్నాన్ని అడ్డుకున్న ఆస్పత్రి సిబ్బంది



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో ఉండాల్సిన సామాగ్రి ఆస్పత్రి బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. ఆస్పత్రి నిర్వహణ లేకపోవడం, ఇన్‌పేషెంట్లు రాకపోవడంతో ఆస్పత్రి నిర్మానుష్యంగా మారింది. దీనిని అదనుగా తీసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు ఆసుపత్రిలోని ఒక వార్డులో ఉన్న స్టూల్, కూలర్, రాక్స్, బెడ్‌కు సంబంధించిన ఇనుప సామాగ్రిని ఆస్పత్రి బయట ఉన్న సూపరింటెండెంట్ క్వార్టర్ ముందుకు తరలించారు. ఆదివారం ఉదయం ఈ సామాగ్రిని ఆటోలో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా ఆస్పత్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికిరణ్‌చైతన్యకు సమాచారం అందించారు. దీనితో ఆ సామాగ్రిని ఆటోలో తరలించే వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోగా, సామాగ్రిని ఆస్పత్రి లోపలికి తరలించారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికిరణ్‌చైతన్యను సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, దుస్తులు పంపిణీ



నవతెలంగాణ-జైపూర్

మండలం ముదిగుంట గ్రామపంచాయతీ క్రికెట్ క్రీడాకారులకు క్రికెట్ కిట్టుతో పాటు దుస్తులు పంపిణీ చేశారు. యువతను ఆటల పోటీల్లో ప్రోత్సహించడం కోసం 16 మంది క్రీడాకారులకు తన సొంత ఖర్చులతో ఏకరూప దుస్తులు క్రికెట్ సామాగ్రి అందజేసినట్లు జైపూర్ ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్ తెలిపారు. ఆటల్లో ప్రావీణ్యం పొంది క్రీడల్లో రాణించాలని సూచించారు. ఆటల పోటీల ద్వారా శరీరానికి వ్యాయామం మానసిక ఏకాగ్రత ఏర్పడుతుందని పేర్కొన్నారు.

చింతాగూడలో విషాదచాయలు

నవతెలంగాణ-జన్నారం

నిజామాబాద్‌లో ఫ్యాన్కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న మెడికో విద్యార్థి దాసరి హర్ష అంత్యక్రియలు చింతగూడలో ఆదివారం నిర్వహించారు. అయితే హర్ష తల్లి రాధా విలపిస్తూ కన్నకొడుకు చితికి నిప్పు పెట్టి దహన సంస్కారాలు చేశారు. ఆ తల్లిని చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి శ్రీనివాస్ దుబాయిలో ఉండడంతో హర్ష దహన సంస్కారాలను తల్లి చేసింది. అంత్యక్రియలకు గ్రామస్తులు పెద్దఎత్తున వచ్చారు.

సమస్యల పరిష్కారానికి యువత సిద్ధం కావాలి

నవతెలంగాణ-నస్పూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి యువకులు సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం నర్సయ్య భవనంలో భారత కమ్యూనిస్టు పార్టీ మండల సమితి మండల కార్యదర్శి జోగుల మల్లయ్య అధ్యక్షతన 25 మంది యువకులు పార్టీలో చేరారు. యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో పోరాటాలు నిర్వహిస్తున్న సందర్భంలో ఆ కార్యక్రమాలకు ఆకర్షితులై కమ్యూనిస్టు పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మిర్యాల రాజేశ్వరరావు, మొగిలి లక్ష్మణ్, సంగం సదానందం, కుంచాల శంకరయ్య, నర్సింగరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తాం



నవతెలంగాణ-జన్నారం

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు చేస్తామని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కనికరం అశోక్, కూకట్లారి బుచ్చయ్య అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల సీపీఐ(ఎం) ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొనడానికి పార్టీ మండల నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని తమ్మినేని వీరభద్రం అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండ గొర్ల లింగన్న, పోతు విజయ, అంజన్న జయఅక్క పాల్గొన్నారు.

నేడు శివశంకరుని జాతర

వాంకిడి : మండలంలోని బెండార గ్రామ సమీపంలో సోమవారం శివశంకరుని ఆలయం జాతర నిర్వహించనున్నట్టు ఆలయ పూజారి నికోడె ధర్మయ్య ఆదివారం తెలిపారు. ప్రతి ఏడాది శివరాత్రి తర్వాత ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందదన్నారు. మండలకేంద్రంతో పాటు మడలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు జాతరకు వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారన్నారు. ఈ జాతరలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో రావాలని ఆయన కోరారు.

ఎనిమిదేండ్లలో దేశాన్ని భ్రష్టు పట్టించిన బీజేపీ

- ప్రజలకు వివరించి చెప్పేందుకే 23 నుండి ప్రచారజాతాలు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని భ్రష్టు పట్టించిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్‌కు వచ్చిన ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చెప్పేందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మార్చి 23 నుండి రాష్ట్రంలో మూడు ప్రచార జాతాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఒక జాతా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సెక్రటేరియట్ సభ్యులు వీరయ్య నాయకత్వంలో ఈ జాతా పలు జిల్లాలు, మండల కేంద్రాల గుండా సాగుతుందని అన్నారు. మూడు జాతాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, ప్రధాన నగరాలు, మండల కేంద్రాల గుండా సాగి మార్చి 30న హైదరాబాద్ చేరుకుంటుందని, అదే రోజు హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎనిమిదేళ్ల బీజేపీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని, రెండు కోట్ల ఉద్యోగాల హామీ, రూ.80 లక్షల కోట్ల నల్లడబ్బులను విదేశాల నుంచి తీసుకురావడం లాంటి హామీలను తుంగలో తొక్కారని అన్నారు. 2022 వరకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీని నెరవేర్చకపోగా, రైతులకు నష్టం చేకూర్చే వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. బీజేపీ హయాంలో మతకల్లోలాలు పెరిగాయని అన్నారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేయడంలో భాగంగానే కొన్ని గనులను ఇప్పటికే వేలం వేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా తాము పోరాటం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, గిరిజనేతరులకు కూడా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనేతరుల విషయం రాష్ట్ర పరిధి కాదని, కేంద్రం చట్టంలో మార్పు చేయాలని తప్పించుకునే ప్రయత్నం చేయడం సరికాదని అన్నారు. మూడు తరాలుగా సాగు చేసుకుంటున్న గిరిజనేతరులకు కూడా పట్టాలు ఇవ్వాలని చట్టంలో స్పష్టంగా ఉన్నందున వారికి కూడా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిని ప్రజలకు వివరించి చెప్పేందుకే తాము ప్రచార జాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రచార జాతాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో రాబోయే రోజులలో పార్టీ సభ్యులు చేపట్టే కార్యక్రమాలు, ప్రచార జాతా విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, పైళ్ల ఆశయ్య, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశాలత, మంచిర్యాల, కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాల కార్యదర్శులు సంకె రవి, కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, ముంజం శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేసే యోచనలో సీపీఐ(ఎం)

రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేసే యోచనలో తామున్నట్లు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. బీఆర్ఎస్ గత ఏడాది కాలంగా మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతోందని, ఈ నేపథ్యంలోనే మునుగోడు అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్‌కు మద్దతిచ్చి బీజేపీకి బుద్ధి చెప్పినట్లు తెలిపారు. రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని, మతోన్మాద బీజేపీని ఎదుర్కొనేందుకే తాము బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అలాగని రాష్ట్రంలో బీఆర్ఎస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు మద్దతివ్వబోమని స్పష్టం చేశారు. పోడు భూములు, దళిత బంధులో అక్రమాలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంతో తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

విప్లవ కెరటం భగత్‌సింగ్ పుస్తకావిష్కరణ

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం భారత విప్లవ కెరటం భగత్‌సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రపంచ రెడ్ బుక్ డేను నిర్వహించి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ పుస్తకంలో 175 సంవత్సరాల క్రితం 1848, ఫిబ్రవరి 21న పెట్టుబడిదారీ వ్యవస్థ నగ్నస్వరూపాన్ని బట్టబయలు చేసిన పుస్తకం ఇదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, గెడం టీకానంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం
- పంచనామా నిర్వహించిన తహశీల్దార్ ప్రమోద్



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

తాళం వేసి ఉన్న ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న నగదు, వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలి బూడిదయ్యాడు. ఈ సంఘటన ఆదివారం ఉదయం నజ్రూల్‌నగర్ గ్రామంలోని ట్రాక్టర్ షెడ్డు ఏరియాలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ట్రాక్టర్ షెడ్డు ఏరియాకు చెందిన బిపుల్ షీల్ కూలీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కావడంతో కూలీ డబ్బుల కోసం బయటకు వెళ్లాడు. భార్య పక్కంటికి వెళ్లగా పిల్లలు ఇద్దరు ఆరు బయట ఆడుకుంటున్నారు. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో విద్యుత్ వైరు షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాద వశాత్తు మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మార్కెట్ ప్రధాన కార్యదర్శి సమీర్ గుప్తా చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపివేయించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లో ఉన్న నగదు, బంగారం, ఫ్రిజ్జు, టీవీ తోపాటు ఇతర సామాగ్రి పూర్తిగా మంటల్లో దగ్దమయ్యాయి. ఘటన స్థలానికి తహశీల్దార్ ప్రమోద్, ఈజ్‌గాం ఏఎస్సై హీరామన్ చేరుకుని పంచనామా నిర్వహించారు. ఈ అగ్ని ప్రమాదంతో బంగారం, రూ.70 వేల నగదు, ఇతర సామాగ్రీ కాలిబూడిదయ్యాయని, దాదాపు రూ.4 లక్షల ఆస్తి నష్టం జరిగిందని తహశీల్దార్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం ఇప్పించాలని బాధితుడు కోరారు. ఎంపీటీసీ బికాస్ ఘరామీ, వార్డు సభ్యులు రనవీర్ బిశ్వాస్, మృదుల్ చౌదరీ, మహదేవ్ బడై తదితరులు మంటలు అదుపులోకి తెచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



ఒగ్గు కళా సంస్కృతిని కాపాడుదాం



నవతెలంగాణ-భీమారం

ఒగ్గు కళా సాంస్కృతి సాంప్రదాయాలను కాపాడేందుకు యాదవులంత కృషి చేయాలని తెలంగాణ యాదవ ఒగ్గు పూజారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డేగ రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. మండంలోని మద్దికల్ గ్రామంలో ఆదివారం మల్లన్న కళ్యాణం, నాగవెల్లి పట్నాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాల మల్లిఖార్జున స్వామి ఆలయ ప్రధాన పూజారి ఐన గురువు చీర్ల గట్టయ్య యాదవ్ ఆధ్వర్యంలో గవ్వ ధారణ స్వీకరించిన రమేష్ యాదవ్ ఇక నుంచి యాదవ ఒగ్గు సంప్రదాయం ప్రకారం జరిగే అన్ని కార్యక్రమాల్లో గురువు స్థానంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ యాదవ ఒగ్గు కళా సంస్కతిని కాపాడుకోవడానికి యాదవులనంతా సమన్వయం చేస్తూ తమ బాధ్యతలను నెరవేస్తూ, ఒగ్గు కళా సాంస్కృతి సంప్రదాయాలను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలకు విస్తరించడానికి తమ బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ యాదవ ఒగ్గు పూజారులు సంఘం అధ్యక్షుడు కాల్వ మనోజ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గాలి పర్వతాలు యాదవ్, జూలపల్లి ఆలయ ప్రధాన పూజారి ఎళ్ళబోయిన తిరుపతి యాదవ్, బెల్లంపల్లి గాజనవెన మల్లయ్య యాదవ్, అల్లంలా మల్లయ్య యాదవ్, అట్టల రాజన్న యాదవ్, కొండా రవి యాదవ్, జంపెల్లి శంకర్ యాదవ్, కావటి రవి యాదవ్, కొమ్ము అశోక్ యాదవ్, రాపెల్లి రాజన్న యాదవ్ పాల్గొన్నారు

డబుల్ బెడ్‌రూం లబ్దిదారుల జాబితా సిద్ధం

- వార్డుల వారిగా జాబితాల ప్రదర్శన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్దిదారుల జాబితా ఆదివారం మున్సిపల్ కార్యాలయానికి చేరింది. ఈ జాబితాలను పట్టణంలోని 30 వార్డులలో ప్రధాన కూడళ్లలో మున్సిపల్ సిబ్బంది ప్రదర్శనకు ఉంచారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాలలో కూడా ఈ జాబితాలను అంటించారు. మున్సిపాలిటీ పరిధిలో 288 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఉండగా, రెండు నెలల క్రితం వార్డుల వారీగా దరఖాస్తులను స్వీకరించిన విషయం తెల్సిందే. పట్టణంలోని 30 వార్డుల నుండి 5,372 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. అనర్హులను తొలగించి జాబితాను ప్రభుత్వానికి నివేదించారు. పరిశీలన అనంతరం 911 మంది అర్హులతో కూడిన జాబితా తహసీల్దార్ కార్యాలయానికి రాగా, వీటిని మున్సిపల్ కార్యాలయానికి పంపించారు. ప్రస్తుత జాబితా నుండి 288 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వార్డుల వారీగా ప్రస్తుతం ఉన్న దరఖాస్తుల సంఖ్య ఈ విదంగా ఉన్నాయి. 1వ వార్డులో 34 దరఖాస్తులు రాగా 2వ వార్డులో 12, 3-52, 4-14, 5-16, 6-09, 7-16, 8-26, 9-53, 10-19, 11-33, 12-24, 13-39, 14-34, 15-29, 16-13, 17- 58, 18-52, 19-48, 20-16, 21-11, 22-30, 23-39, 24-23, 25-34, 26-38, 27-49, 28-09, 29-36, 30-45 మొత్తం 911 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

48 ఏండ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చిన్ననాటి జ్ఞాపకాలు చెరిగిపోకుండా ఉండేవిధంగా జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో 1974-75 విద్యా సంవత్సరంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 48 సంవత్సరాల తర్వాత విద్యార్థుల ఒకే చోట కలవడంతో వారి ఆప్యాయతకు అంతులేకుండా పోయింది. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని బాగోగులు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు కొమురయ్య, పాండురంగారావులను ఘనంగా సన్మానించడంతోపాటు కట్న కానుకలు అందించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ జీవితంలో ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్న సందర్భంలో 48 సంవత్సరాల క్రితం కలిసి చదివిన వారు ఒకచోట చేరడంతో కొన్ని సమస్యలకు పరిష్కారం దొరకడంతో పాటు కొంత ఆహ్లాదం కలుగుతుందన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ జీవితంలో ఎన్నో రకాల ఒడిదుడుకులను ఎదుర్కొన్నామని తెలిపారు. చదువుకున్న కాలం ఎంతో గొప్పదని గుర్తు చేసుకున్నారు. 48 సంవత్సరాల తర్వాత తిరిగి స్నేహితులంతా ఒకచోట కలవడం శేష జీవితంలో మర్చిపోలేని అంశమని అన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేయడానికి కృషి చేసిన వారికి ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు అదే బ్యాచ్‌కు చెందిన కొంతమంది ఇప్పటికే మరణించడంతో వారికి నివాళ్లు అర్పించారు. ఏది ఏమైనా మరోసారి వారంతా కుర్రాళ్ళుగా మారిపోయారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, నిసార్, రాము, ఇమ్రాన్ గౌడ్, పూర్వ విద్యార్థులు ఎంపీపీ మల్లికార్జున్, రాజేశ్వర్, శంకర్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ఆస్పత్రి యాజమాన్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆడపిల్ల పుడితే ఉచితంగా వైద్యం అందిస్తామన్న మాటను ఆస్పత్రి యాజమాన్యం నిలబెట్టుకుంది. కాగజ్‌నగర్‌లోని షణ్ముఖ ఆస్పత్రిని ఇటీవలే ప్రారంభించారు. ప్రారంభం సమయంలో తమ ఆస్పత్రిలో ఆడపిల్ల పుడితే ఉచితంగా వైద్యం అందిస్తామని ప్రకటించారు. ఆదివారం కాగజ్‌నగర్ మండలం నామానగర్‌కు చెందిన నిర్మల సిజేరియన్ ద్వారా ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఆమె నుండి డబ్బులు తీసుకోకుండా ఆదివారం డిశ్చార్జి చేశారు. ఆపరేషన్ చేసిన డాక్టర్ సుయేషా, నర్సులు సుమలత, రత్నంలను ఆస్పత్రి యాజమాన్య ప్రతినిధులు వినయ్‌కుమార్, యాదగిరి, సత్యనారాయణ, అరుణ్‌కుమార్, చంద్రశేఖర్‌లు అభినందించారు.

క్రికేట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బోర్లకుంట గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటును ఆదివారం స్థానిక సర్పంచ్ రత్నం మధూకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను పరిగణలోకి తీసుకోకుండా స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు ఆడాలన్నారు. ఈ టోర్నమెంటులో గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ.10,116 వేలు ద్వితీయ బహుమతి రూ.5116 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి రోజు పోటీలో కొత్మీర్, పెసరుగుంట జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రత్నం సుధాకర్‌తో పాటు యువకులు నరేందర్ చారి, తిరుపతి పాల్గొన్నారు.

నేతకాని సంఘం కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో నేతకాని కుల హక్కుల పరిరక్షణ సంఘం మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కూరి రాయమల్లు చేతుల మీదుగా ప్రారంభం చేశారు. కార్యక్రమంలో నేతకాని కుల హక్కుల పరిరక్షణ సంఘం మండల అధ్యక్షుడు దుర్గం మహేందర్, నాయకులు దాగం మల్లేశ్, కొయ్యల ఏమాజీ, జాడి పోశం, ఉపాధ్యాక్షుడు సోదారి సురేశ్ పాల్గొన్నారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్‌కు రూ.30 వేలు విరాళం

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట మండలంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న కాసిపేట మండల క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నీ నిర్వాహణకు దేవాపూర్‌కు చెందిన గొంది వెంకటరమణ వారి తండ్రి స్మారకార్థం రూ.30,000 విరాళంగా అందించారు. ఈ మేరకు ముత్యంపల్లి క్రీడామైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులకు చెకు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విక్రంరావు, ఎంపీటీసీ రాంచందర్, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, వేణు, శంకర్, రమేశ్, రాజయ్య, శివ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి మహమ్మద్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

హైదరాబాదులో అగ్రవర్ణ కులాలకు చెందిన ప్రియాంక రెడ్డి పై గ్యాంగ్ రేప్ జరిగితే ఏవిదంగా శిక్షించారో అదే తరహాలో కాకతీయ మెడికల్ కళాశాలలో అనస్తేసీయ పీజీ విద్యార్థి తరావత్ ప్రీతి ఆత్మహత్యయత్నానికి కారణమైన సీనియర్ వైద్య విద్యార్థి మహమ్మద్ సైఫ్‌ను శిక్షించాలని సేవాలాల్ సేన మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గుగులోతు మల్లేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రీతి గత కొన్ని రోజులుగా సీనియర్ వైద్య విద్యార్థి సైఫ్ ర్యాగింగ్ చేస్తూ, శారీరకంగా వేధిస్తూ తక్కువ కులం అంటూ హేళన చేశాడని వాపోయారు. సమావేశంలో సేవాలాల్ సేన జిల్లా మహిళా అధ్యక్షురాలు ఇస్లావత్ జ్యోతిబాయ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు సపావట్ శంకర్ నాయక్, దూరోపోతబాయి, శంక్లాల్ రాజునాయక్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రాఘవేంద్ర స్వామి జయంతి వేడుకలు

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోనిపలు దేవాలయాల్లో శ్రీరాఘవేంద్ర స్వామి జయంతి వేడుకలను భక్తులు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. శ్రీరాఘవేంద్ర స్వామి జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం మండల కేంద్రంలోని హనుమాన్, శ్రీమహాలక్ష్మి అమ్మవారి దేవాలయాల్లో భక్తులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కు భూమేష్, జక్కు సత్తయ్య, లచ్చన్న, సుధాకర్, శీలం రమేష్, వేణు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్

పర్ధాన్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పిట్టలవాడ ఆదివాసీ భవన్‌లో ఆదివారం ఆదివాసీ జిల్లా పర్ధాన్ సమాజ్ అడాక్ జిల్లా ఎన్నికలు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ప్రజలు సభ్యులు హాజరయ్యారు. జిల్లా ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పూర్తి కమిటీ ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఉద్యోగ ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కుర్సెంగా తానాజీ, ప్రధాన కార్యదర్శి కుమార్ శ్రీనివాస్(ఉట్నూర్), గౌరవ అధ్యక్షులు ఆత్రం అనసూయ, సభ్యులు అన్ని పదవులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పర్ధాన్ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-తాంసి



కప్పర్ల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గత ఇరవై మూడు సంవత్సరాల క్రితం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యా బోధన చేసిన గురువులను పూలమాలలతో పాటు శాలువా కప్పి సన్మానించారు. వారు చదువుకున్న రోజుల్లోని సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ఎంత ఉన్నత శిఖరంలో ఉన్న చిన్ననాటి మిత్రులను మరచిపోవద్దని ఆపదలో ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిష్టన్న, శ్రీనివాస్, స్వామి, సరిత, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

రిమ్స్‌లో ట్యూటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 16 ట్యూటర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్టు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 2న ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అనాటమీ డిపార్ట్‌మెంట్‌లో నాలుగు, ఫిజియాలజీలో నాలుగు, బయోకెమెస్ట్రీలో రెండు, ఫార్మాకాలజీలో నాలుగు, ఫోరెన్సిక్ మెడిసిన్‌లో రెండు పోస్టులకు నియామకాలు చేపట్టనున్నట్టు తెలిపారు. 45 ఏండ్లలోపు వయసున్న వారు అర్హులని అన్నారు. నెలకు రూ.57వేలు 700 చెల్లించడం జరుగుతుందని అన్నారు. మూడేండ్ల పాటు కొనసాగిస్తామని, ఇతర వివరాలకు ఆదిలాబాద్.తెలంగాణ.గావ్.ఇన్ వెబ్‌సైట్ సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

ప్రజల వద్దకు ఆర్టీసీ అనే కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్ రాథోడ్ సుభద్రబాయి బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ రామేశ్వర్ సూచించారు. ఆదివారం మండలంలోని కొత్తపెల్లి(హెచ్)లో నిర్వహించిన ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమంలో పాల్గొని పూజ చేసి బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొత్తపెల్లి నుండి ఉట్నూర్ వరకు ప్రతి రోజూ గ్రామీణ ప్రజలకు మూడు ట్రిప్పులు బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రజలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపి ఆర్టీసీ సిబ్బందిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ రూట్ ఆఫీసర్ జనార్దన్ గ్రామ ప్రజలు ఉన్నారు.

స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ గత 14 వారాలుగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం తమ వంతుగా రోగుల సహాయకులకు, పేదలు, నిస్సహాయుల ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, భూరె సురేష్, యాదోరావ్, సాయిగౌడ్, రామకృష్ణ, విశాల్, గంభీర్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో జిల్లా క్రీడాకారుడి ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆంధ్రప్రదేశ్ విజయవాడలో నిర్వహించిన ఆక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 23వ కృష్ణ రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీలో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన చరణ్ తేజ ప్రతిభను కనబరిచాడు. అండర్-11 టు 18 వయస్సు గల పోటీల్లో 93 విద్యార్థులు పాల్గొనగా చరణ్ తేజ్ ఏడో స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ఆయనకు డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, పేటా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి కోచ్‌లు కృష్ణ, వీజీఎస్ రాకేష్‌లు అభినందించారు.

సామూహిక అటవీ వనరుల యాజమాన్య ప్రణాళిక సమావేశం



నవతెలంగాణ-సిరికొండ

సామూహిక అటవీ వనరుల యాజమాన్య ప్రణాళిక సమావేశాన్ని మండలంలోని లచ్చింపూర్(బి) గ్రామ సమీపంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎల్ఎఫ్ కమిటీ సభ్యులు జానకి కొరెంగ (ఢిల్లీ) హాజరై మాట్లాడారు అటవీ హక్కుల గురించి, అటవీ వనరుల యాజమాన్య ప్రణాళిక నిర్వహణ గురించి, అవగాహన కల్పించారు. మండలంలోని 40 గ్రామాల నుండి అటవీ హక్కుల కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు అటవీ శాఖ సిబ్బంది. పెందూర్ నర్మద భగవంత్ రావు, ఉయిక ఈశ్వరిబాయి సీతారాం, గోవర్ధన్ నాయక్, విఠల్, మహదు పాల్గొన్నారు.

భయం తొలగించడానికే టాలెంట్ టెస్ట్

- టీఏవీఎస్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ పరీక్ష
- పరీక్షకు విశేష స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై భయాన్ని తొలగించానికి టాలెంట్ పరీక్షలు ఎంతగానో దోహదం చేస్తాయని డీఐఈఓ రవీందర్ అన్నారు. ఆదివారం తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐఈఓ, ఐటీడీఏ ఏపీఓ భాస్కర్, ఏటీడీఓ నిహారికలు హాజరై ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా ప్రశాంత వాతవరణంలో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని డీఐఈఓ రవీందర్ అన్నారు. ఈ సందర్భంగా టీఏవీఎస్ సభ్యులను ఆయన అభినందించారు. నేటి అధునాతన కాలంలో విద్యార్థులు వారి మేధోశక్తిని పోటీ ప్రపంచానికి అనుగుణంగా పెంపోందుంచుకోవాలని, విజ్ఞాన వంతులుగా, మేధావులుగా తయారు కావాలని అన్నారు.



విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు, అనేక అభ్యుదయ పుస్తకాలు చదవాలని సమాజాన్ని అధ్యయనం చేయాలని అన్నారు. ఉద్యమాలతో పాటు విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు పెట్టడంతో వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థుల హక్కుల కోసం, వారి సమస్యలపై పోరాడుతూ, టాలెంట్ టెస్ట్ పెట్టడం అభినందనీయమని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా టీఏవీఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత 5 సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షకు ధీటుగా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని అన్నారు. పట్టణ, మండల స్థాయిలో మండలానికి టాప్ ఐదుగురిని ఎంపిక చేసి, జిల్లా స్థాయి టెస్ట్ పెడుతామని తెలిపారు. జిల్లా స్థాయిలో టాప్ ముగ్గురికి, అలాగే ప్రభుత్వ పాఠశాలలో రాసిన టాప్ విద్యార్థికి, షీల్డ్స్ సర్టిఫికెట్స్ ఇస్తామని అన్నారు. టాలెంట్ టెస్ట్ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నలంద కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావు, టీఏవీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం తనుష్, జిల్లా అధ్యక్షులు తుంరం ఈశ్వర్, జిల్లా కార్యదర్శి బైరి సోమేశ్, నాయకులు మెస్రం రాజు, బి. రాహుల్, ఉయిక విష్ణు, ఆడ అర్జున్, దీపక్, ఆత్రం కిష్టన్న, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు నర్మధ, అజయ్ పాల్గొన్నారు.

అనుకుంటలో బస్తీ దవాఖాన ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

మున్సిపల్ పరిధిలోని వార్డ్ నెంబర్ 4 అనుకుంటలో బస్తీ దవాఖానను ఆదివారం ఎమ్మెల్యే జోగు రామన్న లాంచనంగా ప్రారంభించారు. ఈ మేరకు బస్తీ దవాఖానాను మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి రిబ్బన్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతివార్డులో మౌలిక వసతులతో పాటు ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన వసతులను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఆస్పత్రిలో కల్పించిన వసతులను పరిశీలించి అక్కడి వైద్య సదుపాయాలను గూర్చి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక 33 జిల్లాలలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని అన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో బస్తీ దవఖానాలతోపాటు ప్రాథమిక వైద్య కేంద్రాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నామని అన్నారు. గత పాలకుల హయాంలో వైద్యం అందక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు ఉండబోవని తెలిపారు. జనసాంద్రత గల ప్రదేశాలలో అందుబాటులోనే వైద్యం అందించేలా బస్తీ దవాఖానలకు శ్రీకారం చుట్టామని అన్నారు. స్థానిక ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షులు అజయ్, డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ పాల్గొన్నారు.



అభివృద్ధి కాగితాలకే పరిమితమా..!

- ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు భూపెల్లి శ్రీధర్

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి కాగితాలకే పరిమితమని, అభివృద్ధిని ముందుకు తీసుకు పోవడంలో స్థానిక ఎంపీ ఎమ్మెల్యేలు వెనకబడ్డారని జిల్లా కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు భూపెల్లి శ్రీధర్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలను మండల అధ్యక్షుడు సామాన్‌పల్లి శేఖర్ ఆధ్వర్యంలో జిల్లా ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా భూతాయి(కె) గ్రామం వద్ద గల వాగు మీదుగా గిరిజాయి, ఉమార్డా, బద్దు నాయక్ తండ, ఇంద్రానగర్ తదితర గ్రామాలకు బీటీ రోడ్డు మంజూరు అయిందని చెప్పడమే తప్ప దానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేయడం లేదని అన్నారు. మరో మూడు నెలల్లో వర్షాకాలం రానున్న నేపథ్యంలో గత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గర్భిణీ స్త్రీలకు ఇబ్బంది కాకుండా, రైతులకు ఎరువులు, గృహ అవసరాలకు రేషన్ సరుకులు తీసుకుపోవడానికి ఇబ్బందిగా మారుతుందని అన్నారు. భూతాయి(కె) వద్ద హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ఎంపీ ఎమ్మెల్యేలు టెండర్ ప్రక్రియ ముగించి పనులు ప్రారంభించాలని అన్నారు. లేదంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూతాయి (కె) ఉప సర్పంచ్ జైతు, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మెన్ సెడ్మకీ ఆనందరావు, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు మల్యాల కరుణాకర్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్, ఆదివాసీ జిల్లా నాయకుడు కోట్నక్ గణేష్, మురళీ, రామ్ సింగ్, పెందూర్ హనుమంతు, తొడసం దాసు, దుర్వ నాగోరావు, గోడం మానాజీ, గోడం శ్యాంరావ్, మధు, దత్తు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- బీసీల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే జోగు రామన్న
- పార్టీలకతీతంగా హాజరైన ప్రముఖ రాజకీయ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

బీసీల అభ్యున్నతే పరమావధిగా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.6వేల 200కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, బీసీల సంక్షేమంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. ఆదివారం స్థానిక టీఎన్జీవోస్ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవం, బీసీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. నూతన బీసీ సంఘం నాయకులు అతిథులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. నాయకులు ముందుగా మహాత్మ జ్యోతిబాపూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నూతనంగా ఎన్నికైన కమిటి సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు





ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం రూ.6వేల 200 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం రూ.2వేల కోట్లను మాత్రమే కేటాయించారు. బీసీల పట్ల వారి చిత్తశుద్ధికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. యాభై శాతం కంటే ఎక్కువగా ఉన్న బీసీలకు కేంద్రం బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించిందని ఆరోపించారు. నూతనంగా ఎన్నికైన బీసీ సంఘ సభ్యులు బీసీల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని సూచించారు. ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచేలా ఐక్యంగా ఉండాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రంగినేని మనీషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్, బీజేపీ నాయకురాలు సుహాసినిరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-సిరికొండ

చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని నారాయణ్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఫకీర్ పేట్ గ్రామంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు మారుతున్న కాలంతో ఆదివాసులు కూడా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 1/70, పీసా, అటవీ హక్కులు, విద్య హక్కు, మోటార్ వెహికల్, చిన్న చిన్న తగాదాల గురించి, ప్రతి మూడు, ఆరు నెలలకొకసారి లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని అన్నారు. న్యాయ పరంగా ఏదైనా సహాయం కావాలంటే తమను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం దిలీప్, ఉయిక సీతారాం, మాడవి మాణిక్ రావు స్వామి, నైతం రాము, హన్మంతు, గంగారాం పాల్గొన్నారు.

మాతాంగ్ రుషి మందిర నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మాతాంగ్ రుషి మందిర నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని మాతాంగ్ రుషి సంస్కార సంఘం సభ్యులు అన్నారు. ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి రూ.50లక్షలు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ దేవాదాయశాఖ మంత్రితో మాట్లాడి మందిర నిర్మాణానికి నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు. సంఘం సభ్యులు పాండురంగ్ సాగురే, సూర్యవంశీ పండరి, సదాశివ్ మెట్టే, వాగ్మారే వామన్‌రావు, కల్వలే అరవింద్, జాదవ్ రోహిదాస్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని చిట్యాల బోరి గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు పనులకు వైస్ ఎంపీపీ జంగు పటేల్ భూమిపూజ చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో అనేక గిరిజన గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపట్టి, అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీ జగదీష్, పీఏసీఎస్ చైర్మెన్ పరమేశ్వర్, గ్రామ సర్పంచ్ లక్ష్మీ వసంత్, ఉపసర్పంచ్ మనిషా దీపక్, మోతిరాం గ్రామ పటేల్, మనోహర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యువజన అథ్లెటిక్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



హన్మకొండలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి యువజన అథ్లెటిక్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-18 విభాగంలో మడావి చిన్నరాం, షాట్‌పుట్ త్రోలో పసిడి, కాంబ్లే సంజన హ్యామర్‌లో పసిడి, సెహ్వాగ్ హైజంప్‌లో రజతం, అనిల్ హ్యామర్ త్రోలో కాంస్యం, అండర్-14 విభాగంలో మెస్రం జగ్జీవన్ 400 మీటర్ల పరుగు పందెంలో పసిడి, అండర్-16 విభాగంలో తెలంగ్‌రావు 400 పరుగు పందెంలో కాంస్య పతకాలు సాధించారు. ఆదివారం వారికి పతకాలను నిర్వాహకులు అందజేశారు. పతక విజేతలకు జిల్లా అథ్లెటిక్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేశ్, పేటా అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, స్వామి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కోచ్‌లు వీజీఎస్ రాకేష్, ప్రియాంకలు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని కనకపూర్ గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న దృష్ట్యా వడ్యాల్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ మహేష్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అన్నాబావు సాఠే అడుగు జాడల్లో నడవాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

గొప్ప సాహితీవేత్త మహనీయుడు అన్నాబావు సాఠే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అన్నాబావు సాఠే విగ్రహాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అణగారిన వర్గాల నుంచి అణిచివేత నుంచి ఎదిగి ప్రపంచంలోనే గొప్ప సాహిత్యాన్ని అందించిన మహనీయుడు అన్నబావు సాఠే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చౌహాన్ సునీత, ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, ఎంపీటీసీ నిమ్మల శివకుమార్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్, ఆన్నాబావు సాఠే ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షులు ఉద్ధవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఏనుగు కృష్ణారెడ్డి విగ్రహ కమిటీ అధ్యక్షులు జన్నారపు సాహెబ్‌రావు, గోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ పరంజ్యోతి అమ్మ భగవానుల వర యజ్ఞం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అమ్మ భగవాన్ భక్తులు, సేవకులు ఆదివారం స్థానిక మావల పద్మనాయక ఫంక్షన్‌హాల్లో భక్తిశ్రద్ధలతో శ్రీ పరంజ్యోతి అమ్మ భగవాన్‌ల వర యజ్ఞం, మహా పాదుకాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ భగవానుల శిష్యురాలు అంబికా దాసాజీ మాట్లాడుతూ జీవితంలో భక్తుల విజయానికి అవసరమైన జ్ఞానాన్ని బోధించామన్నారు. భక్తులు దీక్షను స్వీకరించారని వారికి అమ్మవారి దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. పూజలో పాల్గొన్న ఎంతోమంది భక్తులు వారి జీవితాలలో అమ్మ భగవానులు చేసిన అద్భుతాలను అందరితో పంచుకున్నారని అన్నారు. సోమ దీక్షలో భాగంగా సోమరసాన్ని భక్తులు స్వీకరించారని అనంతరం భక్తులందరికీ అన్నదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ అమ్మ భగవాన్ నిర్వాహకులు రమా, పుల్లయ్య మధు, లక్ష్మి, జగన్, పెందూర్ మాధవ్ పాల్గొన్నారు.

ఘోర రోడ్డుప్రమాదం.. ఒకరు మృతి మరొకరికి గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ పోలిస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ సీఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. యవత్మాల్ జిల్లా కేళాపూర్ తాలూకా పెంబి గ్రామానికి చెందిన రామగిరివార్ సాగర్‌రావు(60), లలిత ఇద్దరు దంపతులు పట్టణంలోని మహాలక్ష్మివాడలోని వారి బంధువుల ఇంట్లో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. ఫంక్షన్ ముగించుకొని తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చాంద జాతీయ రహదారిపై అటుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాగర్ అక్కడికక్కడే మృతి చెందగా, లలితకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో లలితను రిమ్స్‌కు తరలించారు. దీంతో ఆ కుటుంబీకులు రిమ్స్ దగ్గర తమ ఆర్తనాదలు మిన్నంటాయి. ఇదిలా ఉండగా లలితకు మెరుగైన చికిత్స కోసం మహారాష్ట్రలోని వర్ధ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. లారీని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సోమవారం పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఏడు గంటలకు రోడ్డు మార్గం ద్వారా నిర్మల్ నుంచి బయలుదేరి 10 గంటలకు కాగజ్ నగర్ చేరుకొని, అక్కడినుండి మధ్యాహ్నం 12 గంటలకు చింతలమానెపెల్లిలో నిర్వహించనున్న తనికాకు కూలీలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, అక్కడి నుంచి 3 గంటలకు పెంచికలపేటలో చెక్కుల పంపిణీ చేసి తిరిగి 9 గంటల వరకు నిర్మల్ చేరుకుంటారని పేర్కొన్నారు.

పలు గ్రామాల్లో బీజేపీ భరోసా కార్యక్రమాలు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలం కోర్సిని, రన్‌వెల్లి, బాబాపూర్, రవీంద్రనగర్ గ్రామంలో ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీష్ బాబు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి బీఆర్ఎస్ ప్రభుత్వ అవలంబిస్తున్న విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామగొని తిరుపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి సుల్కరి ఉమామహేష్, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జి బిట్టుపెల్లి సత్తన్న, పురుషోత్తం చారి, కిన్నెర సత్తన్న, నగపురే మోహన్, ఎల్కరి వెంకటేష్, దన్నురి సాయి, తోడేటి వెంకటేష్, పిప్పిరే పోశన్న, బిబ్బెర పుల్లన్న, ఎల్కరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు దొంగను పటుకున్న పోలీసులు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలో వరుసగా దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న బెజ్జూరు మండలంలోని సలుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకటేష్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు. బాలాజీ అనుకొడ చర్చ్ వద్ద వాహనాల సిబ్బందితో తనిఖీ నిర్వహిస్తుండగా వ్యక్తి శాలువా కప్పుకొని అనుమాన స్పందనగా చింతలమనేపల్లి నుండి బాలాజీ అనుకొడ వైపు వస్తుండగా పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకొని విచారించగా, బెజ్జూర్, చింతలమానేపల్లిలో గత 3రోజుల నుండి వరుసగా హిందూ ఆలయాలను ధ్వంసం చేసినట్టు నేరం ఒప్పుకున్నాడు. నిందితుడు నేరం చేసిన విధానం నిందితుడు తల్లి తండ్రి చిన్నప్పుడే విడిపోయి తన తల్లి దగ్గర అక్క, తమ్ముడుతో కలిసి సలుగుపల్లి గ్రామంలో నివసించేవాడు. నిందితుడు 20 సంవత్సరాల. క్రితం క్రైస్తవ మతంలోకి చేరి, 3సంవత్సరాల క్రితం నిందితుని తమ్ముడు చనిపోవడం పోయాడు. దీనితో నిందుతుడు పిచ్చివాడిగా ప్రవర్తించడంతో అతనిని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆస్పత్రి చేర్పించారు. అనంతరం ఇంటికి తీసుకువెళ్లి, నిందితుడి తమ్ముని చావుకి హిందూ దేవుళ్లే కారణమని బలంగా నమ్మి ఎలాగైనా హిందూ దేవాలయాలను ధ్వంసం చేయాలని అనుకొని పైన తెలిపిన వివరాల ప్రకారం.. దేవాలయాలన్నీ ధ్వంసం చేయడం జరిగిందఅని నిందితుడు ఆలయంలోకి ప్రవేశించి దేవుళ్లని ధ్వంసం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. కట్టెలను పోగు చేసి నిప్పంటించాడు. అనంతరం పారిపోతుండగా బాలాజీ అనకాడ గ్రామంలో చర్చి వద్ద ఎస్సై విజయ్ నిందితున్ని పట్టుకున్నట్లు తెలిపారు.

హిందూవాహిని మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం హిందూవాహిని జిల్లా సంయోజక్ యోగాచార్య అశోక్ ఆర్య, రాష్ట్ర సహాయ సంయోజక్ మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో హిందూవాహిని మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సంయోజక్‌గా రాచర్ల సాయికుమార్, సహాయ సంయోజక్‌గా ఉప్పుల వెంకటేశ్, రాజేందర్, మహేష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా చాప్లె సాయినాథ్, ఎలుములె మారుతి, ప్రవీణ్, ప్రకాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా సంయోజక్ ఎలుములె దత్తు పాల్గొన్నారు.

నత్తే నయం..

- రెండేండ్లుగా రోడ్డు విస్తరణ పనులు
- ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ జామ్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- తరుచూ ప్రమాదాలు



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణ పనులు నత్తే నయం అన్నట్టు కొనసాగుతున్నాయి. అడిగే వారు లేకపోవడంతో కాంట్రాక్టర్ విస్తరణ పనులు నెమ్మదిగా కొనసాగిస్తున్నాడు. రోడ్డు నిర్మాణం పనుల గడువు ముగుస్తున్నప్పటికీ ఇంకా పనులు పూర్తి కాకపోవడంతో ఖానాపూర్ పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు అభివృద్ధి పనులు కొసాగున్నాయన్న సంతోషం ఉన్నప్పటికీ పనులు గడువులోగా పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల్లో భాగంగా ఇరుకు మట్టి రోడ్డు ఉండటంతో నిత్యం దుమ్ము దూళీ, తరుచు ప్రమాదాలు జరుతున్నాయి. కాని అవేమి నిబంధనలు పాటించకుండా, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ రోడ్డు వెడల్పు పనుల కోసం 2018 సంవత్సరంలో రూ.15 కోట్లు మంజూరి కాగా, అందులో రూ.13 కోట్ల, నలభై లక్షలు రోడ్డు విస్తరణ పనులకు, రూ.కోటి 60లక్షలు డివైడర్ పనులకు మంజూరయ్యాయి. గత సంవత్సరం ప్రారంభమైన రోడ్డు వెడల్పు పనులు నత్త నడకన సాగుతుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒక వైపు రోడ్డు నిర్మాణ పనులు సాగుతుండగా మరోవైపు వాహనాలు వెళ్లేందుకు మట్టి రోడ్డు ఉంది ఆ రోడ్డు మధ్యలో విద్యుత్ స్థంబాలు ఉండటంతో వాహనాలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల బస్సు విద్యుత్ స్తంబాన్ని ఢీ కొనడంతో పట్టణానికి విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, విద్యుత్ తీగలు తెగిపడితే పెద్దప్రమాదం జరిగేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పనులు ప్రభుత్వాస్పత్రి నుండి సాయిబాబా మందిర్ జంగల్ హనుమాన్ వరకు మంజూరైన ఈ రోడ్డు వెడల్పు పనులు తెలంగాణ తల్లి చౌరస్తా నుండి ఎంపీడీఓ కార్యాలయం వరకు డ్రైనేజీ పనులు, డివైడర్ పనులు దాదాపుగా పూర్తికావస్తున్నాయి. కానీ రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వాహనాలు నడపాలన్న భయం వేస్తుందని వాహనదారులు పేర్కొంటున్నారు. దీనికి తోడు దుమ్ము దూళీతో ప్రజలు, వాహనదారులు రోడ్డు పక్కనే ఉన్న నివాసగృహాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అనారోగ్యాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.



పనులు పూర్తయ్యే వరకు ట్యాంకర్‌తో నీళ్లు పోయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యే వరకు కాంట్రాక్టర్ దుమ్ము లేవకుండా ట్యాంకర్‌తో నీటిని పోయించాలి. దీంతో ప్రజలకు దుమ్మునుంచి కొంత ఉపశమనం కలుగుతుంది. ఆనారోగ్యాల బారిన పడకుండా ఉంటారు.

అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తిచేయాలి

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య



రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలి. అధికారులు పనులను పర్యవేక్షించడంతో పాటు రోడ్డు మధ్యలో ఉన్న స్తంబాలను తొలగిస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడకుండా ఉంటుంది. ఇటీవల బస్సు విద్యుత్ స్తంబానికి ఢీకొనడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేవిధంగా చూడాలి.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని స్థానిక 32వ వార్డు సోనార్‌గల్లీలో రూ.30 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేశారు. పట్టణ ప్రగతి నిధుల కింద స్థానిక 32వ వార్డు పరిధిలోని సోనార్ గల్లిలో రూ.30లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ సుందరీకరణ కోసం దాదాపు రూ.25 కోట్ల నిధులను వెచ్చిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధే పరమావధిగా దూసుకుపోతున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ



కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కమీషనర్ శైలజ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, ఫ్లోర్ లీడర్ సతీష్, వార్డ్ కౌన్సిలర్ మోబిన్, స్వరూప పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే చేరికలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసే పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం వార్డు నెం 4 అనుకుంటలో యువకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు బీఆర్ఎస్‌లో చేరిక సందర్భంగా ర్యాలీని నిర్వహించి, సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన మతంతో పాటు ఇతర మతాలు కూడా గౌరవించబడేలా బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతోందని అన్నారు. ఏ మతమైనా ఐక్యమత్యంతో పాటు సమానత్వాన్ని కోరుకుంటుందని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని కేంద్రం బడా బాబులకు అప్పగించిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంపదను సృష్టించుకొని పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని గుర్తు చేశారు. మాత్రం ప్రజలకు అందించాల్సిన కనీస అవసరాలు గ్యాస్, డీజిల్, బీజేపీ పెట్రోల్, నిత్యవసర సరుకుల రేట్లను పెంచుకుంటూ పోతుందని మండిపడ్డారు. ఎన్నికల సమయం దగ్గర పడటంతో మతతత్వ రాజకీయం చేస్తూ ఓట్లు దండుకునే పనిలో పడిందని విమర్శించారు. ప్రజలకు అందిస్తానన్న సంక్షేమ పథకాలు బీజేపీ కేంద్ర ప్రభుత్వం అందులో ఒకటైన పూర్తి చేయకుండా పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహిర్ రంజాని, పట్టణ అధ్యక్షులు అజయ్, నాయకులు జోగు మహేందర్, సాజిదోద్దిన్, స్వరూప రాణి, దాసరి రమేష్, పర్వీన్ పాల్గొన్నారు.

అక్రమ కలప పట్టివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అక్రమంగా తరలిస్తున్న కలప పట్టిన సంఘటన ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలోని మాణిక్ గూడ వద్ద ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు తమకు ఇచ్చిన ముందస్తు సమాచారం మేరకు శనివారం రాత్రి ఒక వాహనం అనుమానాస్పదంగా కెరమెరి వైపు నుంచి వెళ్లినట్టు తెలిపారు. వెంటనే అప్రమత్తమై సిబ్బందితో కలిసి రాత్రి పెట్రోలింగ్ నిర్వహించగా కలప రవాణా చేస్తున్నవారు. విషయం తెలుసుకుని మాణిక్ గూడ వద్ద చెట్లలో వివాహనాన్ని పార్కింగ్ చేసి వెళ్ళిపోయారు. పోలీసులు వాహన పార్కింగ్ విషయం తెలపడంతో ఉదయం సిబ్బంది వాహనం దగ్గరికి వెళ్లి తనకి చేయగా అందులో 31 కలప దుంగలు కనిపించాయి. వెంటనే వాహనం వింగర్ (నెంబర్ లేని వాహనం) అదుపులోకి తీసుకుని డ్రైవర్ గురించి వెతికినప్పటికీ కనిపించకపోవడంతో వాహనాన్ని రేంజ్ కార్యాలయానికి తరలించారు. కలప విలువ 1,96,000 ఉందని, కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. వాహనాన్ని కట్టుకోవడానికి సహకరించిన పోలీసులకు ఎఫ్ఆర్ఓ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్బిఓ రవి, డ్రైవర్ దీవెన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలోని స్థానిక 20వ వార్డు, రాజీవ్‌చౌక్‌లో బజ్జిలు వేసుకుంటూ జీవనం కొనసాగించే బేజుగాం స్వరూపరాణి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాజీవ్ చౌక్ వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అలాగే విషయం తెలుసుకున్న జీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాజా రమేష్ బాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి దహన సంస్కారాలకు ఆర్థిక సాయం చేశారు. అంతిమ యాత్రలో స్థానిక కౌన్సిలర్ బోయినపల్లి అనిల్ రావు, బీఆర్ఎస్ యువనాయకులు, గొనె రాజేందర్, డాక్టర్ రాజా రమేష్ మిత్రబృందం బద్రి సతీష్, కాటుకం నాగరాజు, కిరణ్ కుమార్, ఉప్పులపు సురేష్, ప్రకాష్, వంశి, శ్రీకాంత్, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-ముథోల్

అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ముథోల్‌లోని కాముడి బోగుడ కాలనీలో రూ.50లక్షల ఉపాధి నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలు పరిష్కరించేందుకు విశేషంగా కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇప్పటికే ఏరియా ఆస్పత్రి పనులు ప్రారంభమయ్యాయని అదేవిధంగా పల్లె దవాఖాన సైతం మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. గత సంవత్సరం గ్రామంలో రూ.55లక్షలతో సీసీ రోడ్లను నిర్మించడం జరిగిందని వివరించారు. అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, స్థానిక సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, ఎంపీటీసీ సభ్యులు దేవోజి, భూమేష్, సరళ, శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఖలీద్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్ రెడ్డి, తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రోల్ల రమేష్, మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రిసెప్షన్ వేడుకల్లో డ్యాన్స్ చేస్తూ గుండె పోటుతో యువకుడి మృతి

నవతెలంగాణ-కుభీర్



రిసెప్షన్ వేడుకలో డ్యాన్స్ చేస్తూ గుండె పోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పార్డి(కె) గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రిసెప్షన్ వేడుకల్లో (బరాత్)లో డ్యాన్స్ చేస్తూ యువకుడు మృతి చెందిన విషాద ఘటన నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(కె) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పార్డి(కె) గ్రామానికి చెందిన కిష్టయ్య కుమారుడి వివాహం శుక్రవారం భైంసా మండలంలోని కమోల్ గ్రామంలో జరిగింది. దీంతో పెండ్లి కుమారుడు మిత్రుడిన ముత్యం 19 అనే యువకుడు వివాహ వేడుకలకు హాజరైనారు ఇతను మహారాష్ట్రలోని శివుని గ్రామానికి చెందినవాడు. దీంతో వివాహ వేడుకల అనంతరం కుభీర్ మండలంలోని పార్డి (కె) గ్రామంలో శనివారం రాత్రి రిసెప్షన్ వేడుకలు ముత్యం డ్యాన్స్ చేస్తుండగా ఒక్కసారిగా గుండె పోటు రావడంతో కింద పడి అపస్మారక స్థితిలో పడిపోవడంతో గ్రామస్తులు చుట్టుపక్కల వారు గమనించి భైంసా ఆస్పత్రికి తరలించి అక్కడి వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దింతో ఆగ్రామంలో వేడుకలో కళ్లముందు డ్యాన్స్ చేస్తూ చేస్తూ ఒక్కసారిగా చనిపోవడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులు కంటితడి పెట్టారు.

అదుపు తప్పి వాహనం బోల్తా

- ఇద్దరికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని ఆడపల్లి గ్రామ సమీపంలో ఆదివారం కోళ్ల వ్యాన్ బోల్తాపడటంతో చింతలమానేపల్లి, మండలం రవీంద్రనగర్ గ్రామానికి చెందిన ప్రతాప్ మండల్, కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం నాలుగో నెంబర్‌కు చెందిన అశోక్ మండల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించి, కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ఘనంగా బీరప్ప కళ్యాణ మహోత్సవం



నవతెలంగాణ-కౌటాల

గొల్లకుర్మల ఆరాధ్య దైవం బీరప్ప కళ్యాణ మహోత్సవం మండలంలోని కనికీ బీరప్ప ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ఆదివారం ఆలయంలో బోనాలతో ప్రదక్షణలు చేసిన అనంతరం బీరప్ప కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కులపెద్దలు శంకర్, కడారి రాజులు ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. సోమవారం జోగు ఎత్తుట, మంగళవారం రాత్రి దేవుని నాగవెల్లి బోనాలు, బుధవారం దేవుని ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గొల్లకుర్మలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

మార్చ్ 10న మదర్స వార్షికోత్సవ సభ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలోని మదర్స అరేబియా మదీనాతులం పదవ వార్షికోత్సవం మార్చ్ నెల 10వ తేదీన నూర్ నగర్ ఈద్గా వద్ద నిర్వహించడం జరుగుతుందని మదర్స కమిటీ నాయకులు తెలిపారు. ఆదివారం మదర్సాలో సమావేశమైన మదర్స కమిటీ సభ్యులు మాట్లాడుతూ వచ్చేనెల 10 తేదీ నాడు నిర్వహించే మదర్స పదో వార్షికోత్సవం సందర్భంగా ఖురాన్ ప్రత్యేకతపై సందేశం ఇవ్వడం జరుగుతుందని ఈ సభకు ముస్లింలు, ముస్లింయేతరులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మదర్స కమిటీ బాధ్యులు అబ్దుల్ ఫాయాజ్, అహ్మద్ బిన్ అబ్దుల్లా, అబ్దుల్ రహమాన్, సయ్యద్ నిసార్, సలం, షబ్బీర్, ఖిజ, గౌస ఖాన్, సలీం బెగ్, షేక్ చాంద్, తాజ్, ఇమ్రాన్, జవిద్, మదర్స నిర్వాహకులు జాఫర్ సాదిక్ హుస్సేన్ పాల్గొన్నారు.